TJ99 అనుక్షణం జనం కోసం NEWS

WWW.TELUGUJYOTHIDAILY.COM
www.epaperteluguj yothidaily.com
PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

జాతీయ దిన పత్రిక
అనుక్షణం జనం కోసం

విలేఖర్లు కావలెను



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు
నియోజకవర్గాలు మండలాల వారీగా
"తెలుగుజ్యోతి" జాతీయ దినపత్రిక కు
రిపోర్టర్లు కావలెను
ఎటువంటి యాడ్ టార్గెట్లు లేవు,
క్యాలెండర్ టార్గెట్లు లేవు,
9700959506
www.telugujyothinews. com

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA

సంపుటి:01 సంచిక:327 ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ పేజీలు:04 తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ శుక్రవారం 17-04-2026 వెల రూ.4.00

మీకు బ్లాంక్ చెక్ ఇస్తున్నా: లోక్ సభలో ప్రధాని మోదీ



# డీలిమిటేషన్ తో నష్టం ఉండదు 2

- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌లో వివక్ష ఉండదని ప్రధాని హామీ
- ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా న్యాయం చేస్తామని ప్రకటన
- ఈ అంశంపై రాజకీయం చేయవద్దని విపక్షాలకు సూచన
- మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ మీరే తీసుకోవచ్చని విపక్షాలకు ఆఫర్
- 2029 నాటికి కోటాను అమలు చేయకపోతే మహిళలను ఒప్పించలేమని వ్యాఖ్య

తెలుగు జ్యోతి,డెస్క్

మహిళా రిజర్వేషన్ల అమలుకు ముందు చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ఎలాంటి వివక్షకు, అన్యాయానికి తావుండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విషయంలో తాను "గ్యారెంటీ", "ప్రామిస్" వంటి పదాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నానని, ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఆయన భరోసా

# రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం

- రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం
- తనపై నమ్మకంతో కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందన్న నరేందర్ రెడ్డి
- తెలంగాణ హక్కులపై సభలో పోరాటం చేస్తానని వెల్లడి
- ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యులు



2

# క్షమాపణలు చెప్పాలి

- తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్
- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడం పై ఆగ్రహం
- తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండటమేమిటని ప్రశ్న
- ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని మండిపాటు
- తెలంగాణ వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉందన్న కేటీఆర్
- తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్



2

# వాదన విని నవ్వుతున్నారు

- రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు:లోక్ సభలో తేజస్వీ సూర్య
- డీలిమిటేషన్‌కు జీఎస్‌డీపీని ముడిపెట్టడం మూర్ఖత్వమన్న తేజస్వీ సూర్య
- నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని హామీ
- ఏపీ, తెలంగాణలను కాంగ్రెస్ విభజించిన తీరు బ్రిటిష్ కంటే దారుణంగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ చేసిన విభజన కారణంగా ఏపీ, తెలంగాణ మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం ఉందన్న ఎంపీ



2

తెలుగు జ్యోతి,డెస్క్

డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు.

# ఏపీకి 38, తెలంగాణకు 26 సీట్లు..

## డీలిమిటేషన్‌పై అమిత్ షా కీలక ప్రకటన

- లోక్‌సభ స్థానాల పునర్విభజనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని స్పష్టత
- ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి సీట్లు పెరుగుతాయని వెల్లడి
- ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అమిత్ షా విమర్శ
- జనాభా ప్రాతిపదికన విభజనను వ్యతిరేకిస్తున్న దక్షిణాది నేతలు



2

తెలుగు జ్యోతి,డెస్క్

లోక్‌సభ స్థానాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. డీలిమిటేషన్ తర్వాత దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు తగ్గవని, పైగా సంఖ్యాపరంగా, నిష్పత్తి పరంగా కూడా పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి పెరుగుతాయని నిర్దిష్ట లెక్కలతో సహా వివరించారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. లోక్‌సభ మొత్తం సీట్ల సంఖ్యను పెంచిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల సీట్లు కూడా

# తేజస్వి సూర్యపై కవిత నిప్పులు..

రాజీనామా చేయాలని డిమాండ్



2

- తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారంటూ తేజస్విపై కవిత ఫైర్
- పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

# స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి



2

- కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్ రావు
- కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే తెలంగాణలో 17 ఉన్నాయన్న రాంచందర్ రావు
- ముందు కేరళలో సీట్లు తగ్గించాలని అడగాలని సవాల్
- కాంగ్రెస్ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చిందని ఆరోపణ

# తేజస్వీ సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి: పొన్నం ప్రభాకర్
- తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య
- తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్
- బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న



2

# తేజస్వి సూర్య సంగతి తేల్చేవాళ్లు



2

- బీఆర్‌ఎస్ ఎంపీలే సభలో ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చేవాళ్లు: హరీశ్ రావు
- నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తేజస్వి సూర్య కించపరిచారన్న హరీశ్
- తెలంగాణ త్యాగాల పునాదులపై ఏర్పడిందని వ్యాఖ్య
- రక్తపాతంతో కూడిన విభజనతో తెలంగాణను పోలుస్తారా అని మండిపాటు
- మోదీ బాటలో నడుస్తూ తేజస్వి విషం చిమ్ముతున్నారని ఆగ్రహం

# బీసీలు చట్టసభల్లో ఉన్నపుడే వారికి న్యాయం జరుగుతుంది: శ్రీనివాస్ గౌడ్

2

ALL ARE CONTINUE 2 PAGE

# వాదన విని నవ్వుతున్నారు

మొదటి పేజీ రువాయి

సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు.లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు.డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు.గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.కాంగ్రెస్ నాడు అత్యంత దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను విభజించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటిష్ వారి కంటే దారుణంగా ఉందని అన్నారు. ఏపీ, తెలంగాణ విభజనను కాంగ్రెస్ పాకిస్థాన్, భారత్ విభజనతో పోల్చారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు.

# డీలిమిటేషన్ తో నష్టం ఉండదు... మీకు బ్లాంక్ చెక్ ఇస్తున్నా

మొదటి పేజీ రువాయి

ఇచ్చారు.గురువారం లోక్‌సభలో 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చారు. "ఈ బిల్లు ఘనతను మీరే తీసుకోండి. మీకు నచ్చిన వారి ఫొటోలతో నేను ప్రకటనలు ఇవ్వడానికైనా సిద్ధం. ఈ విషయంలో మీకు 'బ్లాంక్ చెక్' ఇస్తున్నా" అని విపక్షాలను ఉద్దేశించి అన్నారు.ఈ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చే శక్తిమంతమైనదని ప్రధాని అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు విధాన నిర్ణయాల్లో పాలుపంచుకోవడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. 2023లోనే 'నారీ శక్తి వందన్ అధినియం'ను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. "2029 నాటికి మహిళా కోటాను అమలు చేయడంలో విఫలమైతే, మన చిత్తశుద్ధిని మహిళలు నమ్మరు. దశాబ్దాలుగా వారికి నిరాకరించిన హక్కులను అందించే గొప్ప అవకాశం ఇప్పుడు మనకు లభించింది" అని మోదీ అన్నారు.గ్రామ పంచాయతీల నుంచి పట్టణ స్థానిక సంస్థల వరకు ఇప్పటికే వేల సంఖ్యలో మహిళలు నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఇప్పుడు వారిని జాతీయ స్థాయిలో విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయాల్సిన సమయం వచ్చిందని ప్రధాని తెలిపారు. అంతకుముందు, ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని లోక్‌సభ ఆమోదించింది. విపక్షాలు రికార్డెడ్ ఓటింగ్ కోసం పట్టుబట్టడంతో, డివిజన్ ప్రక్రియ ద్వారా దీనికి ఆమోదం లభించింది.

# క్షమాపణలు చెప్పాలి

మొదటి పేజీ రువాయి

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు.తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు.పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు.తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం

మొదటి పేజీ రువాయి

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేం నరేందర్ రెడ్డి ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల పలువురు నేతలు రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రజలు, సమస్యలు, రాష్ట్ర హక్కులు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి పార్లమెంటులో పోరాటం చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, తెలంగాణ నుంచి ఎన్నికైన మరో కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ తదితరులు కూడా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

# తేజస్వీ సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అవమానించినందుకు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ డీఎన్ఏ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

# తేజస్వి సూర్యపై కవిత నిప్పులు..

మొదటి పేజీ రువాయి

పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కార్చిచ్చు రేపాయి. ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా వేదికగా తేజస్వి సూర్యపై విరుచుకుపడ్డారు.నిండు పార్లమెంట్‌లో తెలంగాణ అస్తిత్వాన్ని, అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు ఎంత ధైర్యం ఉంటే తెలంగాణ ఏర్పాటును ఒక విద్వేషపూరిత విభజనతో పోలుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తేజస్వి సూర్య తన ఎంపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అంటే ఒక పోరాటమని, కోట్లాది మంది కలల సాకారమని... అటువంటి పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి బీజేపీ అగ్రనేతలు ఈ వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని కవిత ప్రశ్నించారు. సొంత రాష్ట్రాన్ని అవమానిస్తుంటే అడ్డుకోని వారు పదవుల్లో ఉండటానికి అనర్హులని, తెలంగాణ ప్రజలకు వారు సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

# తేజస్వి సూర్య సంగతి తేల్చేవాళ్లు

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చేవారని వ్యాఖ్యానించారు.తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు... ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్–పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదే బాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు.రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి

మొదటి పేజీ రువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు. కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే, తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. మొదట కేరళలో లోక్ సభ సీట్లను తగ్గించాలని రేవంత్ రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చారని ఆరోపించారు.మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని, డీలిమిటేషన్ చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ కొత్త పార్లమెంటు భవనంలోనే కోరారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారే వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు.543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ఇప్పుడు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వింత వాదన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# బీసీలు చట్టసభల్లో ఉన్నపుడే వారికి న్యాయం జరుగుతుంది: శ్రీనివాస్ గౌడ్

మొదటి పేజీ రువాయి



ఢిల్లీ, ఏప్రిల్ 16: తెలంగాణలో నిర్వహించిన కుల గణన గణాంకాలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీల అసలు జనాభాను ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపిస్తున్నారని ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 61 శాతం వరకు ఉన్న బీసీ జనాభాను తక్కువగా చూపిస్తూ వాస్తవాలను వక్రీకరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ను ఇప్పటివరకు అమలు చేయలేదని, కులాల వారీగా ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేదని మండిపడ్డారు.బీసీలకు తగిన రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా కేవలం పదవులు ఇస్తున్నామంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీ కుటుంబాల వివరాలు సరిగ్గా సేకరించలేదనే కారణంతోనే తెలంగాణలో కుల గణన వివరాలు బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ గణాంకాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని స్పష్టం చేశారు.బీసీలకు న్యాయం జరగాలంటే ముందుగా కామారెడ్డి డిక్లరేషన్‌ను పూర్తిగా అమలు చేయాల్సిందేనని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని, బీసీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందినప్పుడే వారికి న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 56 శాతం పైగా ఉన్న బీసీ జనాభాకు తగిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు.

# ఏపీకి 38, తెలంగాణకు 26 సీట్లు..

మొదటి పేజీ రువాయి

పెరుగుతాయని తెలిపారు. కర్ణాటకలో 28 నుంచి 42కి, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో ఐదు దక్షిణాది రాష్ట్రాలకు 129 స్థానాలు (23.76 శాతం) ఉండగా, సభ విస్తరణ తర్వాత 195 స్థానాలకు (సుమారు 23.97 శాతం) పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రజల్లో అనవసర భయాలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.లోక్‌సభ సీట్ల సంఖ్యను దాదాపు 816 నుంచి 850కి పెంచి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే, జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల పార్లమెంటులో తమ ప్రాతినిధ్యం, ప్రాధాన్యత తగ్గుతుందని వాదిస్తున్నాయి.ఈ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి రావాలని, జనాభాతో పాటు రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వంటి ఆర్థిక సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మరోవైపు, ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ, తొలుత సీట్లు పెరిగినట్లు కనిపించినా, భవిష్యత్తులో జరిగే డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రస్తుతానికి ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, అన్ని రాష్ట్రాల సీట్లు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ చర్చల నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.కాగా, అమిత్ షా పేర్కొన్న నియోజకవర్గాల గణాంకాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# సదాశివపేట పట్టణ ప్రజల తాగునీటి సమస్యపై తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి టి జి ఐ ఐ సి చైర్మన్ సమీక్ష



**16 ఏప్రిల్ తెలుగు జ్యోతి పత్రిక సంగారెడ్డి**
సదాశివపేట పట్టణ ప్రజల తాగునీటి సమస్యలపై తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి టి జి ఐ ఐ సి చైర్మన్ మరియు సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సదాశివపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో, నిర్మల జయప్రకాశ్ రెడ్డి. సదాశివపేట పట్టణంలోని ప్రతి ఇంటికి రోజు మంచినీళ్లు సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. సింగూరు డ్యామ్ నుండి నేరుగా ఇంటింటికి మంజీరా నీళ్లు అందేలా ఇంటెక్ వెల్ ,ఫిల్టర్ బెడ్ ,ట్యాంకులు ,కొత్త పైప్ లైన్ల నిర్మాణం. సదాశివపేటకు ప్రతిరోజు గంటన్నర నీళ్లు ఇవ్వాలంటే రూపాయలు 175 కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఇంజనీర్ అధికారులు. 60 వేల జనాభాకు ప్రతిరోజు 21 లక్షల గ్యాలన్ల మంచినీళ్లు అవసరం కాగా కొత్తగా నిర్మించే వాటర్ స్కీమ్ లో 52 లక్షల గ్యాలన్ల నీళ్లు అందుబాటులో ఉంటాయని చెప్పిన ఇంజనీర్లు. 50 సంవత్సరాల వరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుచూపుతో ఈ స్కీం ఉండాలని సూచించిన జగ్గారెడ్డి. ఈనెల 17న వాటర్ ప్రాజెక్టు గురించి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చించాలన్న జగ్గారెడ్డి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల కౌన్సిలర్ల అభిప్రాయాలు వారి వార్డుల్లో సమస్యలను నమోదు చేసుకోవాలని సూచించిన జగ్గారెడ్డి. ఈనెల 18వ తేదీన ఎంపీ ,ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిసి వారి అభిప్రాయాలు సైతం తీసుకోవాలని తెలియజేశారు. చివరగా ఈనెల 19న సదాశివపేట ప్రజల అభిప్రాయాలను సేకరించి ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే పరిశీలించండి అన్నారు. అదేరోజు రాత్రి ఫైనల్ రిపోర్టు ను నాకు లేదా టీజీఐఐసి చైర్మన్ నిర్మలకు అందిస్తే మరుసటి రోజు సీఎం రేవంత్ రెడ్డికి ఇస్తామని పేర్కొన్న జగ్గారెడ్డి. ప్రాజెక్టు విలువ రూపాయలు 135 కోట్లు అంచనా వేసినప్పటికీ ప్రజాభిప్రాయం ఆధారంగా ఆ విలువ పెరిగిన ఇబ్బంది లేదని సూచించిన నిర్మల జయప్రకాశ్ రెడ్డి. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు అత్యవసరమైనందున ముందుగా త్రాగునీటి సమస్య పరిష్కరించి ఆ తర్వాత పేదలకు ప్లాట్లు ,వార్డుకు రూపాయలు 8 కోట్ల చొప్పున అభివృద్ధి నిధులు గురించి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుందామన్నారు. వాటర్ స్కీంకు ఆమోదం రాగానే టెండర్లు పిలిచి రెండేళ్లలో పనులన్నీ పూర్తి చేస్తామని నిర్మల జయప్రకాశ్ రెడ్డి తెలియజేశారు

## కొండాపూర్ వాటర్ వర్క్ ఇన్స్పెక్టర్

# గుండ్ల శంకర్ కు దళితరత్న అవార్డు..



**తెలుగుజ్యోతి, శేరిలింగంపల్లి ఏప్రిల్ 16:**
ఈ నెల 14 వ తేదీన రవీంద్ర భారతి లోడాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ లు కో చైర్మన్ ల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి రోజున కొండాపూర్ వాటర్ వర్క్స్ లో వర్క్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న ఉద్యోగి గుండ్ల శంకర్ కు దళితరత్న అవార్డు పురస్కారం ను అందుకున్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ కో చైర్మన్ లు దొమ్మాటి సుదర్శన్ బాబు, అల్లి బిల్లి మహేందర్ లు గుండ్ల శంకర్ అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి వారికి మెమెంటోను అందజేశారు. చేస్తున్న వృత్తిలో లో కూడా సేవాభావం తో పని చేస్తున్న శంకర్ ను పలువురు ప్రముఖులు ప్రశంసలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు జి. చెన్నయ్య పాల్గొని అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుండ్ల శంకర్ మాట్లాడుతూ నేను విధులు నిర్వహిస్తున్న వాటర్ వర్క్స్ లో కూడా ప్రజలకి అతిముఖ్యం అయిన నీటిసరఫరా లో కూడా సేవాభావంతో పనిచేశానని దానికి ఈ దళితరత్న అవార్డు పురస్కారం ను అందించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ పెద్దలకి, నా వృత్తిలో నాకు ఈ అవార్డు పురస్కారం రావడానికి సహకారం అందించిన వాటర్ వర్క్స్ అధికారులకి, సిబ్బంది హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని తెలిపారు.

# బోరబండలో హ్యూమన్ రైట్స్ ఆఫీస్ ప్రారంభం

**ప్రజల హక్కుల పరిరక్షణకు కొత్త అడుగు**
**పేదలకు న్యాయ సహాయం, ఉచిత సేవలు**
**దేశవ్యాప్తంగా శాఖలు అందుబాటులో హెల్ప్‌లైన్**

**తెలుగుజ్యోతిశేరిలింగంపల్లి, ఏప్రిల్ 16:**
బోరబండ ప్రాంతంలో హ్యూమన్ రైట్స్ ఆఫీస్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం సహాయపడనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్టడంలో హ్యూమన్ రైట్స్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పేదవాళ్ళు డబ్బులు లేక కోర్టు చుట్టూ తిరగలేని పరిస్థితుల్లో వారికి హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ తోడ్పాటుగా నిలుస్తుందని తెలిపారు. దేశం అంతటా తమ సంస్థకు శాఖలు ఉన్నాయని, హ్యూమన్ రైట్స్ యాప్



ద్వారా లేదా 9133113322 నంబర్‌కు సంప్రదించి సహాయం పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రతి జిల్లాలో హ్యూమన్ రైట్స్ ఆఫీసర్లు ఉండగా, రిటైర్డ్ జడ్జీలు, ఉన్నతాధికారులు సంస్థలో భాగమై న్యాయం కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ & నేషనల్ ప్రెసిడెంట్ అబ్దుల్ రెహమాన్, రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ షైక్ అహ్మద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి. శివకుమార్, చీఫ్ అడ్వైజర్ అజయ్, జనరల్ సెక్రటరీ ధర్మేంద్రతో పాటు తస్లీమ్ బేగం,





క్యామర్ జాన్, శంకర్, ఆశగ్ ఖాన్, గౌస్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు పట్ల హర్షం ..

**మహిళా నేత దోనేపూడి రమాదేవి..**



**తెలుగుజ్యోతి మియాపూర్ ఏప్రిల్ 16:**
చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామము అని మియాపూర్ డివిజన్ కి చెందిన ప్రసాద్స్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధురాలు దోనేపూడి రమాదేవి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తి లో సమాన హక్కులు కల్పించి, మహిళలు గౌరవంగా జీవించేలా చేసిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు, అలాగే ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మహిళాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, మహాలక్ష్మి స్కీమ్,ఆరోగ్య లక్ష్మి స్కీమ్,ఉమెన్ ఎంటర్ప్రెన్యూర్ షిప్, మహాలక్ష్మి ఫైనాన్సియల్ అసిస్టెన్స్, ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన,షీ టీమ్స్, బాలామృతం, మెటర్నిటీ బెనిఫిట్ స్కీమ్, చీఫ్ మినిస్టర్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్, ఉమెన్ ఎంటర్ప్రెన్యూర్ సపోర్ట్ స్కీమ్, లాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆమె తెలిపారు. అలాగే చట్ట సభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించడం వలన మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని దోనేపూడి రమాదేవి తెలిపారు. రాబోయే మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి భారత పార్లమెంట్ వరకు అన్ని పార్టీలలో అలాగే అన్ని రంగాలలో మహిళల ప్రతిభ మనం చూస్తున్నామని ఆమె అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు అన్ని పార్టీల మద్దతు తప్పక ఉంటుందని ఆమె అన్నారు. పహల్గామ్ తీవ్ర దాడులకు వ్యతిరేకంగా ఆపరేషన్ సింధూర్ లో ఇండియన్ ఆర్మీ కలనల్ సోఫియా క్యురేషి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ లాంటి మహిళా ఆఫీసర్స్ పోరాట పటిమ, ధైర్య సాహసాలు చూసేము. అవకాశం వస్తే మహిళలు కూడా బ్రహ్మాండం గా వారి వారి రంగాలలో రాణిస్తారు అని దోనేపూడి రమాదేవి తెలిపారు. దేశం లోని అన్ని రాజకీయ పార్టీలు మహిళా బిల్లు కి మద్దతు తెలపాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు

## ఇంటర్మీడియట్ ఫలితాలలో సత్తా చాటిన "అనురాధ "

### "అభినందించిన" సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మరియు సిబ్బంది



**తెలుగు జ్యోతి న్యూస్**
**ఆమదాలవలస నియోజకవర్గం :**
ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో బొర్రం పేట గ్రామానికి చెందిన వై. అనురాధ అనే విద్యార్థిని ఎంపీసీ విభాగంలో 420/470 మార్కులు సాధించడం పట్ల బొర్రం పేట గ్రామా ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పేద కుటుంబానికి చెందిన వై. అనురాధ సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదివి 470 కి 420 మార్కులు సాధించడం గర్వకారణమని తల్లిదండ్రులు చిన్నారావు , నాగమణి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి మంచి మార్కులు సాధించి కళాశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని భవిష్యత్తులో కూడా ఉన్నత చదువులు చదివి గ్రామానికి తల్లిదండ్రులకి మంచి పేరు తీసుకురావాలని కళాశాల ఉపాధ్యాయులు అన్నారు . ఈ సందర్భంగా బొర్రం పేట గ్రామస్తులు అభినందించారు.

## హైదరాబాద్‌లో మలబార్ గోల్డ్ , డైమండ్స్ 'ఆర్టిస్ట్రి స్టోర్' ప్రారంభం




**కూకట్ పల్లి, తెలుగు జ్యోతి, ఏప్రిల్ 16:** మలబార్ గోల్డ్ & డైమండ్స్ జుబ్లీ హిల్స్ రోడ్ నం.10లో 'ఆర్టిస్ట్రి స్టోర్'ను ప్రారంభించింది. సినీ నటి కరీనా కపూర్ ఖాన్ ఈ స్టోర్‌ను ఆవిష్కరించారు. భారతదేశంలో ప్రత్యేకమైన లగ్జరీ జ్యువెలరీ డెస్టినేషన్‌గా ఈ స్టోర్‌ను తీర్చిదిద్దినట్లు సంస్థ తెలిపింది. వ్యక్తిగత అనుభవం, నైపుణ్యం, ప్రత్యేక సేవలను అందించే విధంగా స్టోర్‌ను రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమంలో మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్, ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశర్ ఓ, రిటైల్ హెడ్ సిరాజ్ పి.కె., హైదరాబాద్ జోనల్ హెడ్ మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు. సుమారు 16,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్, వినియోగదారులకు ప్రత్యేకమైన లగ్జరీ షాపింగ్ అనుభవాన్ని అందించనుంది.

## అనాధలైన చిన్నారులకు సి జి ఆర్ ట్రస్టు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అండగా నిలిచారు



**16 ఏప్రిల్ గురువారం, తెలుగు జ్యోతి దినపత్రిక ప్రతినిధి.**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో చాకలి దుర్గేష్ అకాల మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నది. దుర్గేష్ కుటుంబానికి తోడుగా నేనున్నానంటూ గోవర్ధన్ రెడ్డి ఆడపిల్లల పేరిట రూపాయలు 50 వేల డిపాజిట్ తక్షణ సాయం చేస్తానని హామీ ఇచ్చారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ఇంటి పెద్దను కోల్పోయి ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. సి జి ఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. చాకలి దుర్గేష్ మరణవార్త తెలుసుకొని తీవ్ర విషాదంలో ఉన్న వారి ఇంటికి వెళ్లి భౌతికయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. దుర్గేష్ కుమార్తెలైన ప్రవళిక, లిఖిత, పేరిట ఒక్కొక్కరికి రూపాయలు 25 వేల చొప్పున పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ అవసరాల కోసం నగదు సాయం అందజేసి భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సిజిఆర్ ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, నాయకులు వెంకటరామిరెడ్డి, రవీందర్ రెడ్డి ,భాస్కర్ రెడ్డి సి జి ఆర్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న తూర్పు నిర్మల జగ్గారెడ్డి

## రైతులు ,మహిళలు, విద్యార్థుల సంక్షేమ ప్రధాన లక్ష్యం

**ఏప్రిల్ 16 గురువారం తెలుగు జ్యోతి దినపత్రిక సంగారెడ్డి**






ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కంది మండలం రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రారంభ దశలో రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి టీజీఐఐసీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య హాజరై పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం రైతులు మహిళలు విద్యార్థుల సంక్షేమ ప్రధాన లక్ష్యం అని తెలియజేసినారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రైతుబంధు, రైతు బీమా, తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, గ్రామాల్లో రహదారులు, మురికి కాలువల నిర్మాణం, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు, వీటన్నింటినీ ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు. రాబోవు రోజుల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఇవ్వడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు, వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని మంచినీటి అవసరాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు,ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దడదడలాడించిన పంజాబ్ కింగ్స్... ముంబై ఖాతాలో మరో ఓటమి




ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను 7 వికెట్ల తేడాతో పంజాబ్ చిత్తుగా ఓడించింది. ముంబై నిర్దేశించిన 196 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 16.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (39 బంతుల్లో 80రి), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (35 బంతుల్లో 66) విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో పంజాబ్‌కు మరపురాని విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో పంజాబ్ పాయింట్ల పట్టికలో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.196 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. అయితే, 45 పరుగులకే ప్రియాన్ష్ ఆర్య (15), కూపర్ కానలీ (17) వికెట్లను కోల్పోయింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో కలిసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కేవలం 66 బంతుల్లోనే 139 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీల వర్షం కురిపించారు. ప్రభ్‌సిమ్రన్ ఆఖరి వరకు నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించాడు. ముంబై బౌలర్లు పూర్తిగా తేలిపోయి భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అంతకుముందు, ఈ పోరులో పంజాబ్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దాంతో బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇన్నింగ్స్ ఆరంభంలోనే తడబడింది. 12 పరుగులకే రియాన్ రికెల్టన్ (2), సూర్యకుమార్ యాదవ్ (0) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ క్వింటన్ డికాక్ అద్వితీయ పోరాటం చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో పాతుకుపోయి పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అతనికి నమన్ ధిర్ (31 బంతుల్లో 50) చక్కటి సహకారం అందించడంతో ముంబై కోలుకుంది. డికాక్ కేవలం 60 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో అజేయంగా 112 పరుగులు సాధించాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు చేసింది. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ కేవలం 22 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ముంబైని కట్టడి చేశాడు.పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌లలో 4 విజయాలు నమోదు చేసింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ప్రస్తుతం పంజాబ్ 9 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది.

# అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నూతన కమిటీ ఏర్పాటు

**విద్యార్థుల సమస్యలపై విస్తృత చర్చ**

**ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్**

**గ్రేటర్ హైదరాబాద్ నూతన కమిటీ ప్రకటింపు**

**తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి, ఏప్రిల్ 16:**
అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో తాంద్ర రామచంద్రయ్య భవన్, ముజాఫర్ అహ్మద్ నగర్‌లో కామ్రేడ్ ఎమ్ శ్రీకాంత్ అధ్యక్షతన విద్యార్థులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసుకున్నా సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోసం స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్స్‌గా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం గ్రేటర్ హైదరాబాద్ నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ కార్యదర్శిగా ముత్తన్న శ్రీకాంత్, అధ్యక్షులుగా జి. అరుణ్ కుమార్, కార్యనిర్వాహణ అధ్యక్షులుగా సాయి యాదవ్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా ఎస్. ఈశ్వర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా నవీన్ యాదవ్, కోశాధికారిగా జె.డి. గణేష్ నియమితులయ్యారు. సభ్యులుగా ప్రవీణ్, బి. రిషిక్, ఎస్. శ్రీరామ్, ఏ. వివేక్, పి. సాయి, జాస్మిన్ రాజ్, దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు.యువజన రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్ మాట్లాడుతూ, విద్యలో జరుగుతున్న దోపిడీపై పోరాటాలు నిర్వహించాలని, ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్లావత్ దశరథ్ నాయక్ పాల్గొన్నారు.




# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కొండాపూర్ మండల పరిషత్ లో సమావేశ

**ఏప్రిల్ 15 గురువారం తెలుగు జ్యోతి దినపత్రిక కొండాపూర్**
సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై ఈరోజు అధికారులు ప్రజా ప్రతినిధులుసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కొండాపూర్ ఇంచార్జ్ వైద్యనాథ్ ఏడి అగ్రికల్చర్ పాల్గొన్నారు. ప్రారంభంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశం వినిపించారు. స్వర్గీయ అందెశ్రీ రాసిన తెలంగాణ గేయం వినిపించారు. వైద్యనాథ్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఇంచార్జ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా ప్రజాప్రతినిధులకు వివరంగా తెలియజేసినారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా ప్రజాప్రతినిధులు గ్రామ సర్పంచులు ఉపసర్పంచ్లు వార్డ్ మెంబర్లు ముందుండి వారికి చేరే విధంగా కృషి చేయాలి అని చెప్పి తెలియజేశారు. గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి సమస్యలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువస్తే మేము పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలియజేశారు. గ్రామాల్లో మంచినీటి సమస్యపై, విద్యుత్ సమస్యపై, వితంతు, ఓల్డ్ ఏజ్, పెన్షన్లపై, గ్రామాల్లో ఇంటర్నల్ రహదారులపై, మురికి కాలువలపై, సమస్యలను గుర్తించి ప్రభుత్వ అధికారులకు దృష్టికి తీసుకురావాలని కోరినారు. అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి, మరియు జిల్లా మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కరణకు కృషి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వ విచ్చిన లబ్ధిదారులతో తొందరగా ఇల్లు పూర్తి చేయించేలా కృషి చేయాలి అన్నారు, ఇల్లు లేని వారుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు, వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త మంచినీటి సమస్య రాకుండా జాగ్రత్తగా పడాలన్నారు. మంచినీటి సమస్య విద్యుత్ సమస్య ఏ గ్రామాల్లో ఉన్న ముందుగానే గుర్తించి సమస్య రాకుండా పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు పై సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నది అన్నారు, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రైతులకు రైతుబంధు, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇస్తూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.కొండాపూర్ మండలం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సోమేశ్వరి వారు ఈ సమావేశంలో పాల్గొని వాహనదారుల గురించి పలు సూచనలు చేసినారు. వాహనదారులు పనుల నిమిత్తమై ఇంటి నుంచి బయలుదేరే ముందు తలకు హెల్మెట్ ధరించాలి అన్నారు, అదేవిధంగా వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు, వాహనాలను ఓవర్ టేకు చేయకూడదు అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడప వద్దన్నారు, వాహనాలపై మితిమీరి వేగంగా ప్రయాణించరాదు అన్నారు, అనుకోని విధంగా వాహనాలు అదుపుతప్పి యాక్సిడెంట్ జరిగితే వాహనాలకు ఇన్సూరెన్స్ కలిగి ఉంటే కుటుంబ సభ్యులకు ఎంతో కొంత న్యాయం జరుగుతుందన్నారు. తీవ్రంగా గాయపడితే ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకొని ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి అవకాశం ఉంటది అన్నారు. వాహనాలు నెమ్మదిగా నడపాల అన్నారు. కుటుంబ యజమాని అనుకోకుండా యాక్సిడెంట్లో మరణిస్తే కుటుంబ సభ్యులందరూ వాహనాలకు ప్రమాద బీమా ఉంటే ఇన్సూరెన్స్ ద్వారా డబ్బులు తీసుకోవచ్చు అన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వెళ్లవలసిన గమ్యానికి నెమ్మదిగా వెళ్లడం మంచిదన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వేణుగోపాల్, ఎలక్ట్రిసిటీ ఏఈ సిద్దిరాజు, పంచాయతీ రాజ్ ఏ ఈ శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో వీరప్ప, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ రవి ,మండల అధికారులు, కొండాపూర్ మండలం పంచాయతీ సర్పంచులు , ఉప సర్పంచ్ లు ప్రజాప్రతిథులు తదితరులు పాల్గొన్నారు.







## 60 రోజుల పాటు జంక్ ఫుడ్‌ను మానేస్తే

# శరీరంలో జరిగే మార్పులు ఇవే..



జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని చాలా మందికి తెలుసు. అయితే దాన్ని పూర్తిగా 60 రోజుల పాటు మానేస్తే శరీరంలో కనిపించని లోతైన మార్పులు జరుగుతాయి. ప్రాసెస్ చేసిన స్నాక్స్, అధిక చక్కెర ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్‌ను ఆపేసినప్పుడు శరీరం దెబ్బతిన్న వ్యవస్థలను మళ్లీ సరిచేసుకోవడం ప్రారంభిస్తుంది. తాజా పరిశోధనలు తెలిపిన ప్రకారం కొద్ది రోజులపాటు జంక్ ఫుడ్‌కు విరామం వల్ల ఆకలి నియంత్రణ, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం, మెటబాలిజం మెరుగుపడటానికి దోహదం చేస్తుందని వెల్లడైంది. మొదట కొన్ని వారాలు శుద్ధి దశలా ఉండగా, తర్వాత శక్తి స్థిరంగా మారుతుంది. 60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేస్తే శరీరంలో ఎటువంటి మార్పులు జరుగుతాయో వైద్యులు వివరిస్తున్నారు.

**అతిగా తినడం తగ్గుతుంది..**

60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేయడం వల్ల ఆకలి హార్మోన్లు సమతుల్యం అవుతాయి. జంక్ ఫుడ్ వల్ల ఆకలి నియంత్రణ దెబ్బతింటుంది. దీనివల్ల ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. అయితే 60 రోజుల పాటు దాన్ని మానేస్తే లెప్టిన్, ఘ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు సరిగా పనిచేయడం ప్రారంభిస్తాయి. దాంతో తృప్తి భావం సరిగ్గా తెలుస్తుంది. అలాగే కాలరీలు సహజంగా తగ్గుతాయి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గిస్తే రోజువారీ క్యాలరీలు కూడా ఆటోమేటిక్‌గా తగ్గుతాయి. దాంతో బరువు తగ్గడం, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడం, శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. జంక్‌ఫుడ్ మానేయడం వల్ల గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యం మెరుగుపడుతుంది.

జంక్ ఫుడ్ గట్‌లో బ్యాక్టీరియా సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. దాన్ని మానేస్తే గట్ లైనింగ్ మళ్లీ బలపడుతుంది, మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభంగా మారుతుంది. అంతేకాకుండా శరీర మెటబాలిజం మెరుగవుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారం తగ్గించడం వల్ల మెటబాలిజం సరిగా పనిచేస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీని వల్ల శరీరానికి అవసరమైన శక్తి సమర్థంగా ఉత్పత్తి అవుతుంది.

**మెదడు పనితీరుకు..**

ఇక జంక్ ఫుడ్ మానేయడం వల్ల మెదడు పనితీరు కూడా మెరుగవుతుంది. జంక్ ఫుడ్ మెదడు పనితీరుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మెమొరీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. 60 రోజుల తర్వాత మెదడు మళ్లీ సరిగా స్పందించడం ప్రారంభించి, ఫోకస్ పెరుగుతుంది, అనవసరమైనవి తినాలనే కోరికలు తగ్గుతాయి. అంతేకాకుండా శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గుతుంది. జంక్ ఫుడ్ వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఇది గుండె జబ్బులు, ఇతర సమస్యలకు దారి తీస్తుంది. రెండు నెలలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, చర్మం మెరుగుపడటం, ఉబ్బరం తగ్గడం, కీళ్ల నొప్పులు తగ్గడం వంటి ప్రయోజనాలు కనిపిస్తాయి. 60 రోజులు జంక్ ఫుడ్ మానేయడం కొంచెం కష్టంగా అనిపించినా, శరీరం చాలా త్వరగా ధన్యవాదాలు చెబుతుందని, బయట కనిపించే మార్పుల కంటే లోపల జరిగే మార్పులే ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనవని నిపుణులు తెలియజేస్తున్నారు.

Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223